7

సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ǀ 30 ǀ మార్చి ǀ 2025



▌విశ్వావసు వచ్చేసింది..!

విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ నిర్వహణకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. ఇక ఆలయాల్లో తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమానికి అర్చకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రంజాన్ వేళలు — ఇఫ్తార్ — ఆదివారం సా॥ 6.28

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు వేర్వేరు ప్రకటనలు చేశారు. ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని, జీవితాన్ని ఆనందంగా మలుచుకోవాలని ఆకాంక్షించారు.

వేసవి శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: వేసవి శిక్షణ తరగతుల శిబిరాల నిర్వహణకు అర్హులైన కోచ్‌లు ఏప్రిల్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు బాలబాలికలకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, కోచ్‌లకు నెలకు రూ.4 వేల గౌరవ వేతనం అందజేస్తారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాల నిర్వహణకు కోచ్‌లు, పీఈటీ, పీడీ, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 7 లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు 95054 23226 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జమలాపురంలో పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం చేశారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- రామాలయంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు
- ఏప్రిల్ 12 వరకు తిరుకల్యాణోత్సవాలు
- నేటి నుంచి నిత్యకల్యాణాలు రద్దు
- సర్వాంగ సుందరంగా సిద్ధమవుతున్న భద్రగిరి



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం


భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రగిరిలో శ్రీరామనవమి ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. ప్రతి ఏడాది ఉగాది రోజున ఉత్సవాలకు అంకురార్పణ జరపడం ఆనవాయితీ. ఈ క్రమంలో విశ్వావసు నామ సంవత్సరాది రోజున ప్రత్యేక పూజలతో ఆలయ అర్చకులు, వేద పండితులు వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా వచ్చే నెల 6, 7 తేదీల్లో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం, మహాపట్టాభిషేక మహోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఉగాది వేడుకలు..

విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 7 గంటలకు మూలవరులకు ప్రత్యేక అభిషేకం (తిరుమంజనం) చేస్తారు. ప్రతీ ఆదివారం అభిషేకం నిర్వహిస్తున్నప్పటికీ.. ఏడాదిలో ఐదు రోజుల పాటు ప్రత్యేకంగా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, శ్రీరామనవమి, వైశాఖ పునర్వసు, నరకచతుర్దశి, వైకుంఠ ఏకాదశి రోజుల్లో మాత్రమే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేస్తారు. అలాగే సాయంత్రం ఆస్థాన పురోహితులతో పంచాగ శ్రవణం నిర్వహించనున్నారు. బేడా మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో శ్రీ సీతారాముల వారి ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానంతో పాటు రాశి ఫలాలను భక్తులకు వివరిస్తారు. అనంతరం వేప పూత పచ్చడి నివేదన చేసి భక్తులకు పంచుతారు.

నేటి నుంచి నిత్యకల్యాణం, పవళింపు సేవలు రద్దు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు నిత్యకల్యాణం, పవళింపు సేవలు రద్దు చేశారు. ఉగాది పర్వదినమైన ఆదివారం రక్షాబంధనం, ఉత్సవాంగ స్నపనం, సోమ, మంగళవారాల్లో తిరువీధి సేవలు, 2న గరుడ పట లేఖనం, సార్వభౌమ వాహన సేవ, 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ పూజ, బలిహరణం, హనుమద్వాహన సేవ, 5వ తేదీ సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం జరగనున్నాయి. 6న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 7న మహాపట్టాభిషేకం, 8న సదస్యం, హంస వాహన సేవ, 9న తెప్పోత్సవం, చోరోత్సవం, అశ్వవాహన సేవ, 10న ఊంజల్ సేవ, సింహవాహన సేవ, 11న వసంతోత్సవం, ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి గజవాహన సేవ, 12న శనివారం చక్రతీర్థం, పూర్ణాహుతి, శేషవాహన సేవ, ధ్వజావరోహణం, పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మిథిలా స్టేడియంలో పనులు చకచకా జరుగుతున్నాయి. భక్తులకు సరిపడా వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. కాగా, స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన చేశారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన అనంతరం బేడా మండపంలో నిత్యకల్యాణం నిర్వహించారు.



నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

ముస్తాబైన పెద్దమ్మ తల్లి ఆలయం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని జగన్నాథపురం – కేశవాపురం మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయంలో ఉగాది సందర్భంగా 30వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు శ్రీదేవీ వసంత నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించగా కొత్త శోభ సంతరించుకుంది. కాగా, ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కలశపూజతో ఉత్సవాలను ప్రారంభిస్తారని ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. అలాగే, ప్రతీరోజు ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఆలయంలో పూలమాలలతో అలంకరణ

ఉత్సవాలకు ప్రచారం లోపం..

పెద్దమ్మతల్లి ఆలయంలో ఏటా వారం పాటు నిర్వహించే శ్రీదేవీ వసంత నవరాత్రి మహోత్సవాలకు ఈసారి ప్రచారం లోపం ఎదురైంది. వారం, పది రోజుల ముందే ప్రచార కరప్రతాలు ముద్రించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయడమే కాక ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేసిన దాతలను ఆహ్వానించాల్సి ఉంటుంది. కానీ ఈసారి కరపత్రాలను ఉత్సవాల ప్రారంభానికి ముందురోజైన శనివారం పంపిణీ చేయగా దాతలందరికీ అందలేదని తెలిసింది. ఈ విషయమై ఈఓ రజినికుమారిని వివరణ కోరగా.. కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు ఒక రోజు ముందు పంపిణీ చేసిన విషయం తనకు తెలియదని, వివరాలు ఆరా తీస్తానని తెలిపారు.

భద్రాద్రి అభివృద్ధికి రూ.34 కోట్లు

- కొత్తగూడెంలో త్వరలోనే ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ
- ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ముఖ్యమంత్రికి ప్రేమ
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన రాయల, ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాపై అపారమైన ప్రేమ ఉందని.. అందుకే అడిగిందే తడవుగా ఇక్కడి ప్రజల ప్రయోజనాల కోసం నిధులు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బడ్జెట్‌తో పాటు ఈ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఆయకట్టుతోపాటు ఎన్నెస్పీ ఆయకట్టు స్థిరీకరణ కూడా ఈ ప్రాజెక్టుతో సాధ్యమైందని, వచ్చే జూన్ నాటికి సత్తుపల్లి ప్రాంతంలో మరో 80వేల ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని చెప్పారు. అలాగే, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కేటాయించిన రూ.34కోట్లతో భూసేకరణ, ఇతర పనులు చేపట్టనున్నామన్నారు. అంతేకాక దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కూడా సీఎం చొరవతో కొత్తగూడెంలో ఏర్పాటుకానుందని, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ కూడా ఏర్పాటైతే భద్రాద్రి ప్రాంతమంతా అభివృద్ధి జరుగుతుందని తుమ్మల అన్నారు. పాండురంగాపురం, విష్ణుపురం రైల్వేలైన్ ద్వారా సారపాక వరకు 16 కి.మీ. కనెక్టివిటీ ఇస్తే భద్రాచలానికి భక్తుల ప్రయాణం సులువు అవుతుందని వెల్లడించారు. ధంసలాపురం వద్ద ఫ్లైఓవర్ పూర్తిచేసి ఖమ్మం -రాజమండ్రి జాతీయ రహదారిపై రవాణాను సుగమం చేసేందుకు వచ్చే ఆగస్టు 15 నాటికి పనులు పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కాగా, ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర రూ.21 వేలకు చేరాలని అధికారులకు సూచించామని, ఉగాది సందర్భంగా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే, నేలకొండపల్లి పాత రోడ్డుకు సంబంధించి జాతీయ రహదారుల అథారిటీ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న భానుమతి

భద్రాచలంఅర్బన్ : ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి భానుమతి సూచించారు. పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును శనివారం ఆమె సందర్శించారు. వంటశాల, జైలు పరిసరాలను పరిశీలించాక, రిమాండ్ ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షణికావేశంలో నేరాలకు పాల్పడితే అన్ని విధాలా నష్టపోతారని, ఇకనుంచైనా అలాంటి తప్పిదాలు చేయకుండా ఉండాలని చెప్పారు. విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. ఖైదీలలో మార్పునకు కృషి చేయాలని జైలు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

భద్రాచలం: భద్రాచలంలో ఏప్రిల్ 6న జరిగే శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. మిథిలా స్టేడియంలో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీరామనవమికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీవీఐపీలు, వీఐపీలు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, న్యాయమూర్తులు కుటుంబాలతో వస్తారని, ఈ మేరకు గ్యాలరీల్లో అన్ని వసతులను సమకూర్చాలని ఆలయ అధికారులకు సూచించారు. ఎండల దృష్ట్యా చల్లదనం కోసం ఏర్పాటు చేస్తున్న మిగ్‌ఫాస్ట్ సత్ఫలితాలిచ్చేలా ముందుగా ట్రయల్ రన్ నిర్వహించాలని చెప్పారు. సామాన్య భక్తులు కల్యాణాన్ని కనులారా వీక్షించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భక్తులకు మజ్జిగ, ప్రసాదాలు, తలంబ్రాలు, తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసేలా మ్యూజియం నిర్మించామని, దీనిని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు.



నిర్వాసితులతో కలెక్టర్, ఎమ్మెల్యే, పీఓ తదితరులు

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్..

మాడ వీధుల విస్తరణ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ శనివారం అందజేశారు. ఏడుగురు నిర్వాసితులకు రూ. 2,71,20,834 విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు రూ. 34 కోట్ల నష్టపరిహారం అందజేస్తున్నట్లు చెప్పారు. చిరు వ్యాపారులు షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల కోసం విన్నవించారని, వారికి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దామోదర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మయ్య, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఏఈ రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ గన్యా, జీపీ ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

69 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధిస్తాం

- కొత్త ప్రాజెక్టుల అనుమతి కోసం నిరంతరం కృషి
- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తామని సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ, పా) కె.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక వర్షపాతంతో కొంత ఉత్పత్తి తగ్గిందని, నైనీకి కేటాయించిన 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి తీసివేస్తే లక్ష్యం సాధించినట్టేనని పేర్కొన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే -7 ఓసీకి పర్యావరణ అనుమతులు(ఈసీ) వచ్చాయని, రొంపేడు ఓసీకి కూడా ఈసీ అనుమతులు రానున్నాయని, త్వరలో ఓవర్‌బర్డెన్ (ఓబీ) పనులు ప్రారంభిస్తామని వివరించారు. సంస్థ మనుగడ కోసం ఉద్యోగులు, కార్మికులు రోజుకు 8 గంటలు పనిచేయాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఇతర దేశాల మాదిరిగా తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు, ఎంతో కొంత బొగ్గు ధర తగ్గించి వినియోగదారులకు అందించాలనే యోచనలో యాజమాన్యం ఉందని తెలిపారు. వచ్చే ఏడాది లక్ష్యసాధనకు ఏప్రిల్ నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని వెంకటేశ్వర్లు వెల్లడించారు.

క్లుప్తంగా

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎన్సీపీ పోటీ



మాట్లాడుతున్న ధీరజ్ శర్మ, పక్కన నాయకులు

చంద్రుగొండ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పార్టీని విస్తరించేలా పోటీ చేస్తామని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు ధీరజ్‌శర్మ వెల్లడించారు. చంద్రుగొండలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ నేతృత్వాన ఎన్సీపీని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని, తెలంగాణలో పార్టీకి మహిళలు, యువత అండగా నిలుస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, ముగ్గురు మంత్రులు ఉన్న ఈ జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని విమర్శించారు. కాగా, బీజేపీ అనుబంధ బీజేఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు ఎన్సీపీలో ధీరజ్‌శర్మ సమక్షాన చేరారు. దీంతో ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఏపీ కోఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని రెండు లక్షల మంది పేదలకు పక్కా ఇళ్లు, గ్రామాల్లో తాగునీటి సదుపాయం, సీసీ రోడ్లు, గ్రామదేవతల పూజారులకు గౌరవవేతనం ఇప్పించాలని సామేలు కోరారు. దీంతో ధీరజ్ స్పందిస్తూ కేంద్రప్రభుత్వంలో ఎన్సీపీ భాగస్వామిగా ఉన్నందున ప్రధాని మోదీ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు.

మునగ సాగును ప్రోత్సహించాలి

డీఆర్డీఓ విద్యాచందన



పడమటనర్సాపురంలో అజోల్లా పిట్లను పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

జూలూరుపాడు: మునగ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని డీఆర్డీఓ, అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. శనివారం పడమటనర్సాపురం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న క్యాటిల్ షెడ్(పశువుల పాక)ను, అజోల్లా పిట్స్, నాడెప్ కంపోస్టు పిట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం జూలూరుపాడు మండలంలో సుమారు 34 ఎకరాల విస్తీర్ణంలో మునగ సాగు చేస్తున్నారని, వచ్చే ఏడాది 150 ఎకరాల్లో సాగయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో నిందితుడి వీరంగం



వీరంగం వేస్తున్న నిందితుడు

అశ్వారావుపేట: తరచూ వివాదాలకు కేంద్రంగా ఉండే అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓ నిందితుడు వీరంగం వేశాడు. మండలపరిధిలోని ఆసుపాక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యువతిపై అత్యాచార యత్నం చేయగా గ్రామస్తులు పంచాయతీ నిర్వహించారు. అక్కడ వారిని లెక్క చేయకుండా ఠాణాకు వచ్చిన నిందితుడు తాను ఎమ్మెల్యే తాలూకు వ్యక్తినని, తాను ఫోన్ చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఎవరూ ఉండరని, పోలీసులు కూల్ వాటర్ బాటిల్ తెచ్చి ఇవ్వాలంటూ గంటపాటు నానారభస చేశాడు. అదుపు చేయాల్సిన పోలీసులు వేడుక చూస్తూ ఉండిపోయారు.

మామిడి చెట్లు దగ్ధం

పాల్వంచ: పట్టణ పరిధిలోని బంగారుజాల గ్రామం వద్ద మున్సిపాలిటీకి చెందిన మామిడి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిస్తున్న విషయం శనివారం వెలుగు చూసింది. మున్సిపాలిటీకి బంగారుజాల గ్రామం వద్ద 50 ఎకరాల మామిడి తోట ఉంది. అక్కడి కొన్ని చెట్ల మొదళ్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఎండిపోయిన కర్రలు, చెత్త వేసి నిప్పంటించి దగ్ధం చేస్తున్నారు. దీంతో కొన్ని చెట్లు కాలి ఎండిపోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అల్లుడి దాడిలో మామ మృతి

మణుగూరు టౌన్: మండలంలోని వైఎస్సార్ నగర్‌లో నివాసం ఉండే ఓ వ్యక్తిపై అల్లుడి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వైఎస్సార్ నగర్‌కు చెందిన చింతా రాములు(65), అతని అల్లుడు లింగమూర్తి కలిసి మద్యం తాగారు. అనంతరం గొడవ జరగడంతో అల్లుడు దాడి చేశాడు. దీంతో రాములు తలకు, గొంతు భాగంలో తీవ్రగాయాలు కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం రిఫర్ చేయగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

క్రోధి గతించి.. విశ్వావసు ఏతెంచె..

తెలుగు సంవత్సరాది.. ఉగాది తరలివచ్చింది. క్రోధి నామ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోగా.. చైత్ర మాసపు వసంత సొబగులతో విశ్వావసు కదలివచ్చింది. సమస్త జనుల్లో నూతన ఆశలను రేకెత్తిస్తూ ఏతెంచింది. గత కాలపు కష్టనష్టాలు, అవమానాలు, అనుమానాలకు సెలవిచ్చి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ కొత్త ఏడాదిలో ఆత్మీయ అనురాగాలతో ప్రశాంత పూల పరిమళాలు వెదజల్లుతూ ముందుకు సాగుదాం. నేడు ఏరువాక సాగే రైతుల లోగిళ్ల సిరి సంపదలతో తులతూగాలని ఆశిద్దాం. ఈ సందర్భంగా పండుగ ప్రాశస్త్యం, షడ్రుచుల విశిష్టతను ఆవిష్కరించిన సమసమాజ స్వాప్నికులు.. మన కవుల కృతులను ఆలకిద్దాం. –సాక్షి నెట్‌వర్క్



ఉగాది - సమతా సౌరభం

ఉషోదయపు తళుకులే మార్గదీపమై,
ఉగాది సంబ్రమం నూతన సందేశమై,
సమసమాజం, సహజీవనం, సౌభాగ్య బాట,
సమతా స్వప్నానికీ వేదుకే విజయ బావుటా!
ఈ ఉషోదయం సరికొత్త వెలుగులు చిందించగా,
ఉగాది వచ్చెను ఆనందం పంచగా!
పచ్చడి రుచి జీవన సందేశమై,
ప్రతి హృదయంలో నూతన శుభారంభమై!
చేయి చేయి కలిపి శుభాకాంక్షలు తెలిపి
సామూహిక అనుబంధ సారథులమై,
సంతసమే పంచే సంస్కృతుల వారధులమై
విశ్వ మానవాళికి సత్యం, న్యాయం, మానవతా
సందేశమై!
వృక్షముల పెంపుతో ప్రకృతిని అలంకరిద్దాం,
సహకార స్ఫూర్తితో మనుజతను మేల్కొల్పుదాం,
సమానతా సూత్రం మన ఊసుగా నిలపెడదాం,
సమగ్రాభివృద్ధే ఉగాది సందేశమని పలుకుదాం!
మనిషిని మనిషిగా మలిచే బాటలో సాగగా
ఉగాది మాకొక వెలుగు
జ్యోతిగా..



– తురుమెళ్ల కల్యాణి,
కొత్తగూడెం

మానవత్వం పరిమళించాలి

సరికొత్త చైత్రాన్ని మోసుకొస్తున్న
విశ్వావసు వత్సరానికి స్వాగతం !
అనురాగాల లోగిళ్లలోకి అడుగిడి
కొత్తందనపు సౌరభాల్ని వెదజల్లేందుకు
వస్తున్న ఓ చైత్రమా..!
ఇక్కడ ముక్కలవుతున్న పేగుబంధాలకు
మారాకువేసి మానవీయ విలువ పెంచాలి సుమా..!
రైతురాజుకు ఆదరణనిచ్చి
వారి లోగిళ్లలో ఆనందాలు పంచాలి...!
బాపూజీ కన్న కలలు సాకారం చేసి
అందరి మనసులలో స్వచ్ఛతను నింపాలి..!
అభివృద్ధి పథంలో పయనిస్తూ
ప్రపంచానికే గర్వకారణంగా నిలిచాము..!
అయినా.. ఇక్కడ విషాద ధ్వాంతములు
పురుకునే ఉన్నాయి.
అందుకే నీవు చైతన్యపు కాంతిరేఖల్ని తెచ్చి
ముసురుకున్న చీకట్లను తరిమి కొట్టాలి!
నీ రాకతో మానవత్వం పరిమళించాలి.



– డాక్టర్ సిద్ధాంతపు
ప్రభాకరాచార్యులు,
అశ్వారావుపేట

షడ్రుచుల ఉగాది

మనిషి మనుగడలో..
పండుగైనా పబ్బమైనా...
కష్టనష్టాలు సుఖసంతోషాలు
సమానంగా స్వీకరించక తప్పదు
ఈ తాత్విక సారమే ఉగాది పచ్చడి
ప్రతీక ఉగాది ఉద్బోధిస్తోంది
ఆరు రుచులు ఆరవ వేదమే
బ్రతుకు నాథం..!



– డాక్టర్ కటుకోఝ్వల
రమేష్, ఇల్లెందు

విశ్వావసు తరలివస్తోంది..

కాలం కదిలిపోతోంది
అనుభవాలను అనుభూతులను కానుకగా ఇచ్చి
కష్టాలను నష్టాలను గుణపాఠాలుగా నేర్పి
కాలం కదిలిపోతోంది
ఆత్మీయతలను అనురాగాలను
అల్లుకున్న బంధాలను
బహు చక్కగా పరిచయం చేస్తూ
కాలం కదిలిపోతోంది
ప్రాకృతిక పరిణామాలను
మానవజీవితంలో ప్రతిబింబిస్తూ
తీపి చేదు వగరు పులుపు కారం క్షారతల షడ్రుచుల
సమ్మేళనమై కాలము కదిలివస్తోంది
విశ్వావసు నామ సంవత్సర యుగాదిగా
కాలం కదిలి వస్తోంది
తీపి చేదు జ్ఞాపకాల సమాహారమై గతమై..
క్రోధి నామ సంవత్సరం తరలిపోతోంది
రేరాజు రాజై.. సకల సౌభాగ్యాలను అందించగా..
మానవ మనో మందిరాలలో కరుడుగట్టిన కర్కశత్వాన్ని కరిగించి సౌమ్యతనే నింపగా
సకల శుభములనందించగా
చైత్రమాసపు వసంత సొబగులతో
కాలం కదలివస్తోంది
విశ్వావసు నామ సంవత్సర ఉగాదిగా..
నీకు నాకు సమస్త ప్రకృతికి
నూతన ఆశల ఊపి
రిలూదుతూ
కాలం.. విశ్వావసు నామ సంవత్సరమై తరలివస్తోంది.



– సుమలత, ఉపాధ్యాయురాలు, బాలికల ప్రభుత్వ పాఠశాల, భద్రాచలం

విశ్వావసుకు స్వాగతం

ఉగాది ప్రకృతి పత్రంపై ఆకుపచ్చ పునాది
తెలుగుదనం పల్లవే తియ్యని ఉగాది
నా ఊహల ఉగాది... నా కలల పునాది...
నా అంతరంగ వేది... సర్వజన హృదయ హ్లాది..
ఉగాది. చైత్రం సప్తవర్ణ రంజితం
సప్త స్వరాల సంగమం నూరు వసంతాల సౌందర్య
శోభను వేల నక్షత్రాల కాంతినీ
తనలో ఇముడ్చుకుంటూ వసంత శోభను ఆర్తిగా
పంచు
విశ్వావసుకు స్వాగతిస్తూ
ఆశాంతి ఆవిరై..
ప్రశాంతత పూల పరిమళంలా..



– డాక్టర్ వీధుల రాంబాబు,
ఉపాధ్యాయుడు, జెడ్పీఎస్ఎస్, నెల్లిపాక బంజర

ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి వితరణ

రూ.3 లక్షల విలువైన బెంచీలు, కుర్చీలు అందించిన ఎస్ఎంఎస్ సంస్థ



పాఠశాలకు బెంచీలను అందజేస్తున్న సింగరేణి జీఎం దుర్గం రాంచందర్ తదితరులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత బాలికల పాఠశాలకు సింగరేణి కేపీయూజీ మైన్‌కు చెందిన ఎస్ఎంఎస్ ప్రైవేట్ సంస్థ రూ.3 లక్షల విలువైన సామగ్రిని వితరణ చేసింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఎంఎస్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా బెంచీలు, టేబుల్స్, కుర్చీలు, గ్లాసులు, ప్లేట్‌లు అందించిందని తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఎస్ఎంఎస్ ప్లాంట్ జీఎం కో ఆర్డినేటర్ సీవీ రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు ఉన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో శనివారం సీతారామ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ పర్యటించారు. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో ఆసుపాక గ్రామంలోని సర్వే నంబరు 72లో ఓ రైతు వ్యవసాయ భూమి కోల్పోయాడు. కాగా, నష్టపరిహారం అందలేదని కొద్ది నెలల క్రితం బాధిత రైతు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, ఈ ఫిర్యాదుపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ చేశారు. రైతు నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఆర్ఐలు ఉన్నారు.

త్వరితగతిన నివేదికలు ఇవ్వాలి

దమ్మపేట : సీతారామ ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా సంబంధిత నివేదికలను త్వరితగతిన పూర్తిచేయాలని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సీతారామ ప్రాజెక్టు రికార్డులను పరిశీలించారు. భూమి కోల్పోయిన రైతులు మరణించినా, పట్టాదారు పుస్తకాలు లేకపోయినా, తప్పుగా నమోదయినా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అన్ని సవరణలు చేసి సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కే.వాణి, ఆర్ఐ వీరాస్వామి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలీ స్వాధీనం

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని రంగాపురం వద్ద కిన్నెరసాని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారించగా ఇసుక తరలింపునకు అనుమతులు లేకపోవడంతో యజమాని అర్వెంపుల నరేష్, డ్రైవర్ సతీష్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి



ఖాజా మొయినుద్దీన్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన ఖాజామొయినుద్దీన్ (32) శనివారం ప్రమాదవశాత్తు తాడు మెడకు చుట్టుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంటిపక్కన నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి వెళ్లిన సమయంలో వేలాడుతున్న తాడు ఖాజామొయినుద్దీన్ మెడకు చుట్టుకుంది. ఉరి పడగా అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి మరొకరు..

ఇల్లెందురూరల్: మండలంలోని మొదుగులగూడెం గ్రామానికి చెందిన జాటోత్ రాము (35) పురుగుల మందు తాగి శనివారం మృతి చెందాడు. మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

15 ఏళ్లుగా ఉగాది పచ్చడి పంపిణీ



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మధు

సత్తుపల్లిటౌన్: తెలుగు వారి లోగిళ్లలో ఉగాదికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పండుగ సందర్భంగా అందరి ఇళ్లలో పచ్చడి చేసుకుని స్వీకరిస్తారు. అయితే, ఇళ్లలో చేసుకోలేని వారు, ప్రయాణంలో ఉన్న వారి కోసం సత్తుపల్లికి చెందిన మానుకోట (మాధురి) మధు పదిహేనేళ్లుగా పచ్చడి పంపిణీ చేస్తున్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి పంపిణీ చేయడాన్ని సంతోషంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఒకేచోట ఆ మూడు చెట్లు!



ఖమ్మంగాంధీచౌక్: ఉగాది పచ్చడి తయారీలో వినియోగించే ముడిపదార్థాలను ఇచ్చే మూడు రకాల చెట్లు ఒకే చోట ఉండడం విశేషం. ఖమ్మం శ్రీనివాసనగర్ టీచర్స్‌కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న రైస్ మిల్లు ఆవరణలో మామిడి, వేప, చింత చెట్లతో పాటు కొబ్బరి చెట్టు కూడా ఉంది. షడ్రుచుల్లో వగరు రుచి కోసం మామిడి, పులుపు కోసం చింతపండు, వేపను చేదు కోసం ఉపయోగిస్తారు. ఈ మూడు చెట్లుమిల్లు ఆవరణలో ఉండగా.. ఏటా ఉగాదికి మిల్లులోని హమాలీలేకాక స్థానికులు మామిడి కాయలు, చింతకాయలు, వేప పూత కోసుకునే అవకాశం లభిస్తోంది.

ఉగాది ప్రేమికుడు.. దినేశ్



చింతల దినేశ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంరూరల్ మండలం పెదతండాకు చెందిన చింతల దినేశ్‌కు మొక్కలు పెంపకం ఇష్టం. ఇంటి ఆవరణలో రకరకాల మొక్కలు, పూలు, పండ్ల మొక్కల చెట్లు పెంచుతుంటారు. మామిడి చెట్టు, వేప చెట్టు నాటగా.. ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఉన్న చింత చెట్టును సైతం సంరక్షిస్తున్నారు. దీంతో ఏటా ఉగాది పండుగ సందర్భంగా కాలనీవాసులు, స్నేహితులు దినేశ్ ఇంటికి క్యూ కడతారు. మామిడి కాయలు, వేప పూతతో పాటు చింత పండును కవర్లలో పెట్టి ఇంటికి వచ్చిన వారందరికీ ఇవ్వడాన్ని దినేశ్ ఆనవాయితీగా మార్చుకున్నాడు.

గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ గంజాయితో ఎస్ఐ రాజ్‌కుమార్ తదితరులు

మణుగూరు టౌన్: సీలేరు నుంచి హైదరాబాద్‌లోని కాలేజీ విద్యార్థులకు విక్రయించేందుకు ఐదు కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మణుగూరులో పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ సతీష్ కుమార్ కథనం ప్రకారం.. ఏడూళ్ల బయ్యారం ఎస్‌హెచ్ఓ, మణుగూరు ఇన్‌చార్జి ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బందితో కలిసి హనుమాన్ ఆలయం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అశ్వాపురం నుంచి మణుగూరు వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారించగా సూర్యాపేటకు చెందిన భీమిశెట్టి మహేశ్, ఘట్‌కేసర్‌కు చెందిన షేక్ ఉమర్‌లు సీలేరుకు చెందిన త్రిమూర్తులు నుంచి గంజాయి కొనుగోలు హైదరాబాద్ తరలిస్తున్నట్లు అంగీకరించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని అంచనా. కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశామని, త్రిమూర్తులు కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పల్లందాస్, సత్యనారాయణ, రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇక సాఫీగా వేతనాల చెల్లింపు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్మికుల వేతనాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పెద్దాస్పత్రిలోని వివిధ విభాగాల్లో 259 మంది కార్మికులు పనిచేస్తుండగా.. నిర్వహణ బాధ్యతలను చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీకి అప్పగించారు. ప్రభుత్వం నుంచి సంస్థకు, వారి ద్వారా సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ బాధ్యతలు నిర్వర్తించే కార్మికులకు వేతనాలు చెల్లిస్తారు. అయితే నెలనెలా సక్రమంగా జీతాలు రాక కార్మికులు చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నారు. వీరికి నెలకు రూ.14,500 మంజూరు చేస్తుండగా కటింగ్ పోను రూ.13వేలు ఖాతాలో జమ చేస్తారు. ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు 575 పడకలకు అనుమతి ఉండేది. ఆ సామర్థ్యం మేరకు ఏజెన్సీకి రూ.50,88,239 చెల్లించేవారు. అయితే 2023 నవంబర్ నుండి పెద్దాస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లాక 430 పడకలనే పరిగణనలోకి తీసుకుంటూ ఆ సామర్థ్యం మేరకు చెల్లింపునకు అనుమతి ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్‌కు రూ.35.40లక్షలే వస్తుండగా, గతంతో పోలిస్తే రూ.15,48,239 తేడా రావడంతో కార్మికులకు వేతనాలు చెల్లింపులో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దీంతో సదరు కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించగా, తీర్పు ద్వారా సమస్యకు పరిష్కారం లభించింది. ఇకపై ప్రతీనెల కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో చెల్లించడమేకాక 2023 నవంబర్ నుండి ఉన్న బకాయిలు కూడా విడుదల చేయనున్నారు. కాగా, కోర్టు తీర్పు ఆధారంగా రూ.2,63,20,063ను కాంట్రాక్టర్‌కు చెల్లించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుండి ఉత్తర్వులు సైతం విడుదలయ్యాయి. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగి ఉన్న బొగ్గు లారీని ఢీకొన్న ఇసుక టిప్పర్



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

మణుగూరు టౌన్: బొగ్గు తరలిస్తున్న లారీ మరమ్మతులకు గురై రోడ్డు పక్కకు నిలిపి ఉంచగా వెనుక నుంచి వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు తరలిస్తున్న లారీ టైర్ పంక్చర్ కాగా సాంబాయిగూడెం ఊరి చివరన నిలిపి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇసుక లారీ ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వాహనం నుంచి వెలికితీసి భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు?

విద్యార్థినులను రక్తం కారేటట్లు కొట్టాడని తండ్రి ఆవేదన

పాల్వంచ: తన కూతుళ్లను రక్తం వచ్చేట్లుగా కొట్టి, బూతులు తిట్టారంటూ పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన వినయ్ అనే వ్యక్తి టీజీడబ్ల్యూఆర్‌జేసీ(బాలికలు) భద్రాచలం పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌పై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇద్దరు కూతుళ్లు అక్కడ చదువుతున్నారని తెలిపాడు. ఈ నెల 24న గురుకుల సెక్రటరీ ఆన్‌లైన్‌లో మీటింగ్ నిర్వహించగా సెక్రటరీకి విద్యార్థులు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదని ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారని పేర్కొన్నాడు. అంతేగాక వారిని రక్తం వచ్చేటట్లు కొట్టి, బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం ఎక్కడైనా చెబితే టీసీ ఇచ్చి పంపిస్తానని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. శుభాకాంక్షలు చెప్పని విద్యార్థినులతో బాత్‌రూంలు కడిగిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపాడు. ఎంఈఓకు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నాడు. కాగా ఈ విషయమై ఎస్ఐ రాఘవయ్యను వివరణ కోరగా.. ఈ ఘటనపై సదరు డిపార్ట్‌మెంట్ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఫిర్యాదుదారునికీ అదే విషయం వివరించామని తెలిపారు.

వైద్య, ఆరోగ్యశాఖ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్ బి.రత్నరాజును సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రత్నరాజు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టగా నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేశారు. ఈ విషయంపై డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్‌ను వివరణ కోరగా.. సస్పెండ్ చేసినది నిజమేనని తెలిపారు.

జెన్ ఏఐలో ఇంకా వెనుకబాటే..!


అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉపయోగించుకోవడంలో భారతీయ పరిశ్రమలు, సంస్థల వెనుకడుగు

బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా నివేదిక వెల్లడి

జెన్ ఏఐ ప్రయోజనాలను 80% డెవలపర్లు గుర్తించినా, ఉపయోగిస్తున్నది 39 శాతమే

భద్రతపై సందేహాలు, ఉద్యోగాలు పోతాయనే భయమే కారణమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'(జెన్ ఏఐ) వల్ల కలిగే ప్రయోజనాలను ఉపయోగించుకోవడంలో భారత పరిశ్రమలు, సంస్థలు వెనుకడుగు వేస్తున్నాయి. గ్లోబల్ ఐటీ పవర్‌హౌస్‌గా గుర్తింపు పొందడంతో పాటు టెక్నాలజీ ట్రేడ్‌లో 250 బిలియన్ డాలర్ల పరిశ్రమగా 50 లక్షల మంది ఐటీ నిపుణులతో విరాజిల్లుతున్న భారత ఐటీ పరిశ్రమ 'జెన్ ఏఐ'కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి అవుట్ సోర్సింగ్ రంగంలో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్న దశలో ఎల్ఎల్ఎం ఫైన్ ట్యూనింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాల్లో యువతరం (నెక్స్ట్-జనరేషన్) '51 శాతం మేర స్కిల్డ్ టాలెంట్ గ్యాప్'ను ఎదుర్కొంటున్నట్టు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల భవిష్యత్తులో కృత్రిమ మేథ ఏఐ సంబంధిత ఆవిష్కరణల్లో తమ ప్రాధాన్యతలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చుననే ఆందోళన భారత నిపుణుల్లో వ్యక్తమవుతోంది. 'జెన్ ఏఐ'వల్ల కలిగే ఉత్పాదకత వృద్ధి ప్రయోజనాలను 83 శాతం డెవలపర్లు గుర్తించినా, వారు దీనిని ఉపయోగిస్తున్నది 39 శాతమేనని, దానిని అనుసరిస్తూ, తమకు తగ్గట్టుగా వర్తింప చేసుకునే నవయువ డెవలపర్లు 31 శాతానికే పరిమితమవుతున్నట్టు బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా అధ్యయనంలో తేలింది. ఈ సవాళ్లను సరైన పద్ధతుల్లో సమాధానాలు వెతుక్కోవడంతో పాటు వాటిని అధిగమించే దిశలో చర్యలు చేపట్టకపోతే గ్లోబల్ ఏఐ లీడర్లుగా ఉన్న యూఎస్ఏ, చైనాల కంటే వెనుకబడే ప్రమాదం ఉందని అధ్యయనం హెచ్చరించింది. ఈ రంగంలో మధ్యస్థ శక్తులుగా ఎదిగిన దక్షిణ కొరియా, జపాన్, సౌదీ ఆరేబియా కూడా పైస్థాయికి చేరుకునే ప్రయత్నాలు చురుగ్గా సాగిస్తున్న సమయంలో భారత్‌కు ఇది సవాళ్లతో కూడుకున్నదనే అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను అధిగమించి కృతనిశ్చయంతో ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ కొరవడడం, ఈ అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్న క్రమంలో ఎదురవుతున్న భద్రతాపరమైన సందేహాలు, జెన్ ఏఐ వంటి వాటితో ఉద్యోగాలు పోతాయనే భయం తదితర కారణాలతో వివిధ కంపెనీలు ఆచితూచి స్పందిస్తున్నాయని తెలిపింది. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఐటీ సర్వీసుల్లో జెన్ ఏఐ వర్తింపును వేగవంతం చేయడం ద్వారా పైచేయి సాధించాలంటే భారత్ వివిధ చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది.



రెండేళ్లు గడుస్తున్నా వెనుకబాటే..

2022 చివర్లో ఏఐ, జెన్ ఏఐ అనేవి పరిశ్రమల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాయి. అయితే రెండేళ్లు గడుస్తున్నా జెన్ ఏఐను అందిపుచ్చుకుని, వర్తింపజేసుకునే విషయంలో అధిక శాతం పరిశ్రమలు వెనుకబడ్డాయి. ఇందుకు కారణం టెక్నాలజీ కాదని మానవ స్వభావం, ప్రవర్తనదేనని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు మొదలు డెవలపర్లలో ఉద్యోగాలు కోల్పోతామనే భయం వెంటాడుతుండటమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ అధునాతన టూల్స్‌ను ఉద్యోగులు ఉపయోగించి మంచి ఫలితాలను సాధించేలా చేయడమనేది పెద్ద సవాల్‌గా మారుతోందని అంటున్నారు. ఈ సాంకేతికతను పూర్తిస్థాయిలో అమలు చేసే విషయంలో కష్టమర్ల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతున్నట్టుగా కంపెనీలు పేర్కొంటున్నాయి.

భారత్ ఏం చేయాలంటే..

- వివిధ ప్రావీణ్యాలు, నైపుణ్యాల ఆధారిత శిక్షణా పద్ధతులు (ట్రైనింగ్ మోడళ్లు) చేపట్టాలి.
- ఏఐ, జెన్ ఏఐలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న దానిపై 'ప్రొఫిషియెన్సీ బేస్డ్ ట్రైనింగ్ మోడల్స్' తీసుకురావాలి.
- మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, ఉత్తమ శిక్షణ నిమిత్తం 'ఎగ్జిక్యూటివ్ స్పాన్సర్‌షిప్' చేపట్టాలి.
- భద్రతా పరమైన ఆందోళనలు, సమస్యలు అధిగమించేందుకు పరిశ్రమ క్లయింట్లతో దృఢమైన బంధాలు కొనసాగించేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనరేటివ్ ఏఐ అంటే..



జనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) అనేది యూజర్ కోరుకున్న కంటెంట్ లేదా విజ్ఞప్తికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించుకుంటుంది. ముఖ్యంగా ట్రైనింగ్, ట్యూనింగ్, జనరేషన్ అనే మూడు దశలుగా పనిచేస్తుంది. టెక్ట్స్, ఇమేజెస్, ఆడియోల రూపంలో ఒరిజనల్ కంటెంట్‌ను తయారు చేయగలదు. అధునాతన మెషీన్ లెర్నింగ్ మోడళ్లు మరి ముఖ్యంగా డీప్ లెర్నింగ్ మోడళ్లపై ఆధారపడి ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. ఇది మనుషుల మెదళ్ల మాదిరిగా నేర్చుకోవడం, నిర్ణయం తీసుకునే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

ఎవరు అడ్డుపడ్డా 'వక్ఫ్' సవరణ బిల్లు ఆగదు

దేశం కోసమే కఠిన నిర్ణయాలు: బండి



కరీంనగర్ టౌన్: భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుంచి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లుపై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. ఒవైసీ సహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్‌లో త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

రజతోత్సవాలపై బీఆర్ఎస్ ఫోకస్

- ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ వరుస భేటీలు
- క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా
- జన సమీకరణ, సభ ఏర్పాట్లపై 20కి పైగా ప్రత్యేక కమిటీలు
- ఏప్రిల్ 2న ఎల్కతుర్తిలో బహిరంగ సభా స్థలికి భూమి పూజ
- రెండో వారం నుంచి జిల్లాలవారీగా కేటీఆర్ పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 27న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి కేంద్రీకరించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభకు జన సమీకరణపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సభకు ఎంత మంది తరలివచ్చే అవకాశముందని ఆరా తీస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు స్పందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశాలు నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎప్పటికప్పుడు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. అదే సమయంలో పార్టీ ముఖ్యనేతలతో వరుస భేటీలు నిర్వహించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ అంతర్గతంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, ఏడాది పొడవునా నిర్వహించాల్సిన రజతోత్సవ వేడుకల తీరుతెన్నులపైనా నేతల అభిప్రాయాలు కోరుతున్నట్లు తెలిసింది.

సభ ఏర్పాట్లకు ప్రత్యేక కమిటీలు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత.. సభ నిర్వహణలో పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సభ నిర్వహణ కోసం 20కి పైగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు సభా స్థలి ఎంపిక, రైతుల నుంచి నిరభ్యంతర పత్రాల సేకరణ, పోలీసుల అనుమతులకు దరఖాస్తులు తదితర పనుల్లో తలమునకలయ్యారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌కు కూడా బాధ్యతలు అప్పగించారు. సుమారు 1,200 ఎకరాల్లో బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లు జరగనుండగా, మైదానం చదును చేయడం, వేదిక నిర్మాణం తదితరాలకు సంబంధించి ఏప్రిల్ 2న భూమి పూజ చేస్తారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమీక్షలు

సభను విజయవంతం చేసేందుకు జిల్లాలవారీగా ఈ నెల 20న సన్నాహక భేటీలకు శ్రీకారం చుట్టిన కేటీఆర్.. ఇప్పటికే సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో వరుస సమావేశాలు జరుగనున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేస్తారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కేటీఆర్ జిల్లాలవారీగా రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. కేటీఆర్ జిల్లా పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.



శనివారం కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా లింకురోడ్లు

- హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై సీఎం పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచాలని, ప్రజలు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయి సమయం ఆదా అయ్యేలా ఉండాలని సూచించారు. ఇందుకోసం అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు.

జిల్లా వార్తలు

సింగరేణి ప్రధానాస్పత్రిలో విజిలెన్స్ దాడులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో శనివారం సింగరేణి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో, అంతకంటే ముందు జరిగిన మెడికల్ బోర్డ్ సమావేశాల్లో అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో దాడులు చేశారు. మెడికల్ బోర్డ్‌కు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు డ్రైవర్ల సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నెల 31న సీఎంఓ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఇటీవల కాలంలో మూడుసార్లు విజిలెన్స్ దాడులు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఒకేరోజు 80,931 టన్నుల బొగ్గు రవాణా



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని గనుల నుంచి మునుపెన్నడూ లేనివిధంగా శుక్రవారం ఒకేరోజు 80,931 టన్నుల బొగ్గు రవాణా చేశారు. ఈమేరకు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు శనివారం వివరాలు వెల్లడించారు. ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీ నుంచి ఐదు, జేవీఆర్ సీహెచ్‌పీ నుండి 12 రేక్‌లు కలిపి 17 రేక్‌ల ద్వారా బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఇందులో రైలుమార్గం ద్వారా 67,853 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 13,078 టన్నులు మొత్తం 80,931టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. గతేడాది మార్చి 30న 69,719టన్నుల బొగ్గు రవాణా చేయగా.. ఆ రికార్డును అధిగమించేలా కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు ఆయన అభినందనలు తెలిపారు.

నేడు ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ రాక

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఆదివారం పర్యటించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుంటారని, అనంతరం 10 గంటలకు న్యూట్రి ఫుడ్ ప్రాసెసింగ్ తయారీ యూనిట్ సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామంలోని దాల్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలిస్తారని, మధ్యాహ్నం 12 గంటలకు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఎగ్ ట్రే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తారని వివరించారు.

వీకే -7 ఓసీకి ఈసీ అనుమతి

రెండు నెలల్లో ప్రారంభం కానున్న ఓబీ పనులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వీకే -7 ఓపెన్ కాస్ట్ గనికి ఎట్టకేలకు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్(ఈసీ) అనుమతులు లభించాయి. దీంతో మరో రెండు నెలల్లో ఇక్కడ ఓబీ (ఓవర్ బర్డెన్) పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియా నుంచి సుమారు 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అదనంగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసీ అనుమతుల కోసం దాదాపు మూడేళ్లు ఎదురు చూడాల్సి వచ్చింది.

లక్ష్య సాధనకు మార్గం..

సింగరేణి సంస్థ ప్రతీ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అయితే వీకే -7 ఓసీకి ఈసీ అనుమతులు లభించడంతో 2025 – 26 ఆర్థిక సంవత్సర లక్ష్యాల సాధన కొంత సులువు కానుందని అధికారులు భావిస్తున్నారు. త్వరలో ఆఫ్ లోడింగ్, ఓసీలో హాల్‌రోడ్లు, మెటీరియల్ సరఫరా తదితర పనులు పూర్తి చేసుకుంటే రానున్న ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత వార్షిక లక్ష్యం 76 మిలియన్ టన్నులు చేరుకునేందుకు మార్గం సుగమం కానుంది. దీంతో పాటు ఒడిశాలోని నైనీబ్లాక్‌లో కనీసం ఆరు మిలియన్ టన్నులు తోడయితే 11 మిలియన్ టన్నుల ఉత్పత్తి అదనంగా వచ్చే అవకాశం ఉంది.



వీకె-7 షాఫ్ట్ ముఖద్వారం

ఎట్టకేలకు ఫారెస్ట్ క్లియరెన్స్..

సుమారు 1,114 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 190 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉన్నట్లు ఎక్స్‌ప్లోరేషన్ అధికారుల అంచనా. దాదాపు 35 సంవత్సరాల జీవితకాలం ఉన్న వీకే -7 ఓసీలో 1000 మందికి ఉపాధి కలగనుంది. అయితే ఈ గనికి 773 హెక్టార్లలో అటవీ భూములు అవసరం అవుతాయి. ప్రస్తుతం సింగరేణి ఆధీనంలో 341 హెక్టార్ల స్థలం ఉండగా.. అది కూడా వివిధ కాలనీల రూపంలో ఉందని అధికారులు చెబుతున్నారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తారని తెలుస్తోంది. ప్రైవేట్ భూ యజమానుల సమస్య పరిష్కారం అయినప్పటికీ, అటవీ భూముల సమస్య జఠిలంగా మారింది. ఈ నేపథ్యంలో అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా, వేరేచోట భూమి ఇచ్చినా ఆ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు రాకముందే టండర్ ఖరారు..

వీకె-7 ఓసీకి గతేడాది అనుమతులు వస్తాయని భావించిన యాజమాన్యం రెండు సంవత్సరాల క్రితమే ఓబీ టెండర్‌ను ఖరారు చేసుకుంది. మూడేళ్ల క్రితం ఓసీకి అనుమతులు వస్తాయని, పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేసి, టెండర్లను కూడా ఖరారు చేయడంతో సదరు కాంట్రాక్టర్లు కంపెనీపై ఒత్తిడి పెంచుతున్నారు. అనుమతులు రాకముందే టెండర్లు ఎలా కట్టబెట్టారని, మూడేళ్ల పాటు తామేం చేయాలని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

అనుమతి రావడం హర్షణీయం



వీకె-7 భూగర్భ గని మూడబడడంతో గత మూడేళ్లుగా ఏరియాలో ఉత్పత్తి కొంత తగ్గింది. జీకే ఓసీలో నిక్షేపాలు అడుగంటగా ఈ లోటును జేవీఆర్ ఓసీ పూడ్చుతున్నప్పటికీ.. ఈ రెండు గనుల్లో సుమారు 1,400 మంది కార్మికుల సర్దుబాటు కష్టమైంది. ఇప్పుడు వీకే ఓసీ స్టేజ్–1కు అనుమతి రావడం హర్షణీయం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా స్పందిస్తే ఇంత జాప్యం అయ్యేది కాదు.

– ఎం. శాలెంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

సీఎంకు ఖమ్మం భోజనం..

- 41 రకాలతో మెనూ ఖరారు
- ప్రత్యేక పార్సిల్ ద్వారా నేడు హుజూర్‌నగర్‌కు..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ ప్రముఖులెవరైనా ఖమ్మం జిల్లాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటనకు వస్తే వారికి అవసరమైన స్నాక్స్ మొదలు భోజనం వరకు ఖమ్మంలోనే సిద్ధం చేసి సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యాన ఆదివారం హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యాన అధికారులు ఖమ్మంలోని రెస్టిఇన్ – అమ్మా మెస్ నుంచి 41 రకాల ఆహార పదార్థాలతో కూడిన మెనూ ఖరారు చేశారు. సీఎంతో పాటు మరో 150 మందికి సరిపోయేలా భోజనం, స్నాక్స్, జ్యూస్ వంటివి ఆహార తనిఖీ అధికారులతో పరీక్ష చేయించిన అనంతరం హుజూర్‌నగర్ పంపించనున్నారు.

మెనూ ఇలా..


స్నాక్స్‌లో ఫ్రెష్ ఫ్రూట్ జ్యూస్, టీ, గ్రీన్ టీ, బిస్కెట్లు, షుగర్ క్యూబ్స్, గ్రీన్ సలాడ్, కట్ ఫ్రూట్స్, పుల్కా ఉంటాయి. మాంసాహార వంటకాల్లో బోన్‌లెస్ మటన్ ఫ్రై, ప్రాన్స్‌ఫ్రై, కొర్రమేను ఫ్రై, బగారా రైస్, రైతా, వైట్ రైస్, తెలంగాణ మటన్ కర్రీ, కొర్రమేను కర్రీ, నాటుకోడి కూర, కుండ పెరుగు ఏర్పాటు చేస్తున్నారు. శాకాహార మెనూలో ఉగాది పచ్చడి, మేతి చమన్, కోకోనట్ పొరియల్, జీరా రైస్, రైతా, దాల్ తడకా, వైట్ రైస్, బచ్చలికూర, మామిడికాయ పప్పు, బెండకాయ ఫ్రై, ముద్ద పప్పు, పచ్చి పులుసు, సాంబార్, జీడీ పప్పు వెల్లుల్లి కారం, ఉసిరికాయ చట్నీ, పులిహోర, గోంగూర చట్నీ, కుండ పెరుగు ఉండగా.. స్వీట్లలో పూర్ణం, బొబ్బట్లు, గులాబ్‌జామ్, జిలేబీ విత్ రబ్డీతో పాటు స్వీట్ పాన్, వాటర్ బాటిళ్ల వంటివి ఉంటాయి.

పోలీస్ అధికారులకు సన్మానం

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న తొమ్మిది మంది అధికారులను ఖమ్మంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు పేరు తీసుకొచ్చిన ఉద్యోగుల సేవలు మరువలేనివని తెలిపారు. అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

మతం మారిన వారిని వెనక్కి తీసుకురండి

అభయ హిందూ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్



మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్

అశ్వారావుపేటరూరల్: భారతదేశం దేవ భూమి అని అభయ హిందూ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్ పేర్కొన్నారు. అశ్వారావుపేటలో శనివారం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన ముందస్తు ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రోగిపై కాకుండా రోగంపై హిందువులు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే మతం మారిన వారిని శత్రువులుగా చూడకుండా, వారిని వెనక్కి తీసుకురావడంపై దృష్టి సారించాలని సూచించారు. తొలుత రింగ్ రోడ్ సెంటర్‌లో కోలాట ప్రదర్శన, మేళతాళాలతో ఆయనకు స్వాగతం పలకగా.. బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్‌తో పాటు వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

జనవరి, ఫిబ్రవరి వేతనాలు ఖాతాల్లో జమ

చుంచుపల్లి: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రభుత్వం రెండు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేసింది. దీంతో ఉగాది వేళ కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 4,492 మంది పంచాయతీ కార్మికుల వేతనాలను వారి బ్యాంక్ ఖాతాల్లో శనివారం ప్రభుత్వం జమ చేసింది. కార్మికులకు నెలకు రూ.9,500 చొప్పున వేతనం చెల్లిస్తుండగా, గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో గ్రామ పంచాయతీ కార్మికులు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులను కలిసి విన్నవించగా జనవరి, ఫిబ్రవరి రనెలలకు సంబంధించిన వేతనాలను మంజూరు చేసింది. మార్చి వేతనాన్ని చెల్లించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల పరిధిలో 2,363 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో 2,129 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,492 మంది కార్మికులకు మొత్తం రూ.8.52 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో ఖమ్మం జిల్లాకు రూ. రూ.4.48 కోట్లు కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రూ. 4.04 కోట్లు చొప్పున మంజూరయ్యాయి.


మత్స్యకారులు మరింత అభివృద్ధి సాధించాలి

కూసుమంచి: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మత్స్యకారులు మరింత అభివృద్ధి సాధించాలని ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ సూచించారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణను ఆక్వా హబ్‌గా మార్చేలా అవసరాల మేరకు మత్స్య సంపదను పెంచేందుకు కృషి జరగాలన్నారు. ఈ మేరకు మత్స్యకారులు పాలేరులో పొందిన శిక్షణ ఆధారంగా ఆధునిక విధానాలతో చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, ఏపీ ఫిషరీస్ అసిస్టెంట్ బాలగోపీనాథ్, సీనియర్ రీసెర్చ్ ఫెలో శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేపీయూజీ(కొండాపురం భూగర్భగని)లో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. కేపీయూజీ మైన్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ సంస్థలో చంద్రుగొండకు చెందిన అనిల్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గనిలో డబ్ల్యూ–7 పని ప్రదేశం వద్ద ఉదయం సీఎం మిషన్ మెయింటెనెన్స్‌కు నిలిపారు. యంత్రం కింద మెయింటెనెన్స్ పనిలో అనిల్ నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో మిషన్ లివర్ తగలడంతోపాటు మిషన్ ఓ వైపు ఒత్తివేయడంతో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎడమ కాలు తుంటి భాగం, కుడి మోకాలు కింద భాగంలో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించినట్లు తెలిసింది.

సేవా లోపంపై వినియోగదారుల ఫోరం తీర్పు



ఖమ్మంలీగల్: అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ విషయమై ఒప్పందాన్ని విస్మరించడంతో తీసుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లించడమే కాక నష్టపరిహారం కూడా ఇవ్వాలని ఖమ్మం వినియోగదారుల ఫోరం సభ్యురాలు ఎ.మాధవీలత శనివారం తీర్పు చెప్పారు. భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన గుగులోత్ రాంచందర్, గుగులోత్ లక్ష్మి 2016 డిసెంబర్‌లో ఖమ్మం వెలుగుమట్ల సమీపాన జీఆర్ఆర్ శ్రీనివాస వశిష్ఠ బ్లాక్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జీఆర్ఆర్ రియాలిటీస్ మేనేజింగ్ పార్టనర్ గుర్రం ప్రకాష్‌తో ఒప్పందం కుర్చుకుని రూ.16 లక్షలు చెల్లించారు. కానీ గడువులోగా ఫ్లాట్ ఇవ్వకపోవడమే కాక ఎన్నిసార్లు అడిగినా స్పందించకపోవడంతో రాంచందర్, లక్ష్మి న్యాయవాది ద్వారా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. దీంతో వివరాలు పరిశీలించాక రూ.16 లక్షలను ఏడు శాతం వడ్డీతో చెల్లించాలని, నష్టపరిహారంగా రూ.3 లక్షలు, ఖర్చుల కింద రూ.10 వేలు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

కారు షోరూం యాజమాన్యానికి..

కారు మరమ్మతు చేయించినా మొరాయిస్తుండడంతో షోరూం బాధ్యులు స్పందించలేదని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. ఖమ్మం ధంసలాపురానికి చెందిన బండారు రమ్య కియా సోనెట్ కారును ఖమ్మం కియా షోరూంలో కొనుగోలు చేయగా, కొన్నాళ్లకు ప్రమాదం జరిగింది. ఈ మేరకు షోరూంలో రూ.1,97,157 వెచ్చించి మరమ్మతు చేయించినా తరచుగా సమస్య వస్తోంది. దీంతో న్యాయవాది ద్వారా ఖమ్మం వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించడంతో ఫోరమ్ ఇన్‌చార్జ్ చైర్మన్ లలిత వాదనలు విన్నాక కొత్త సామగ్రితో కారు మరమ్మతు చేసి ఇవ్వాలని తీర్పు చెప్పారు. అంతేకాక రూ.30 వేల పరిహారం, ఖర్చుల కింద రూ.10 వేలను ఫిర్యాదికి అందించాలని విజయవాడలోని సింహ మోటార్స్ బాధ్యులను తీర్పులో ఆదేశించారు.